క్లుప్తంగా

నేడు కబడ్డీ పోటీలు

వల్లూరు : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా మండలంలో శుక్రవారం కబడ్డీ పోటీలు జరుగుతాయని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కోట్లూరు, తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయాల పరిధిలోని జట్లకు తోల్ల గంగనపల్లెలోని వేదాస్ పాఠశాల క్రీడా మైదానంలో, తప్పెట్ల సచివాలయ పరిధిలోని జట్లకు గంగాయపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో, పైడికాలువ, లేబాక గ్రామ సచివాలయాల పరిధిలోని జట్లకు పెద్దపుత్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో, కొప్పోలు గ్రామ సచివాలయ పరిధిలోని పురుషుల జట్లు, మహిళల జట్లకు గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్ క్రీడా మైదానంలో పోటీలు జరుగుతాయని తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

జమ్మలమడుగు : పట్టణంలోని తాడిపత్రి రహదారిలో ఉన్న ఆరోన్ క్లినిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డీఎంఎస్ రాజు తెలిపారు. గురువారం స్థానిక క్లినిక్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూల్‌కు చెందిన కిమ్స్ వైద్యుల పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరానికి మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ డాక్టర్ కె.నవీన్‌కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ టి.నాగేంద్రప్రసాద్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఉచితంగా బీపీ, షుగర్ టెస్టులతోపాటు ఈసీజీ 2డి ఎకోలు చేస్తారన్నారు. రోగులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శాస్త్రోక్తంగా హోమాలు



కళశ పూజ చేస్తున్న పండితులు

వల్లూరు : స్థానిక తూర్పు వీధిలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో గురువారం హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం కళశ పూజలను, కళశ ఆరాధనను నిర్వహించారు. కోదండరామస్వామి, సీతా, లక్ష్మణులకు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులను చూపుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చెన్నూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆరోగ్యశ్రీ కార్డులను మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి పేదవాడు తనకు ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా ఉండేందుకు రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచాడన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం యొక్క ఉపయోగాలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించాలని ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు, వలంటీర్లలకు సూచించారు. ఆరోగ్యశ్రీ కార్డులను త్వరగా ప్రజలకు చేరవేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం శర్మ, పంచాయతీ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, డాక్టర్ సీహెచ్ వంశీకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ అల్లి శ్రీరామమూర్తి, వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదర్‌రావు, జీవీ నరసయ్య కోరారు. గురువారం కడపలో నిర్వహించిన నాన్ ఆపరేషన్ రీజియన్ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు.

ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'



పులివెందులలో రసవత్తరంగా సాగుతున్న కబడ్డీ పోటీలు



కమలాపురం : సీఎస్ఐ చర్చ్ గ్రౌండ్‌ను దోజర్‌తో సిద్ధం చేస్తున్న దృశ్యం

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకటబయపురెడ్డిలు తెలిపారు. వేములలోని క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులను వారు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎంతోమందికి క్రీడలలో ప్రతిభ ఉన్నప్పటికి జాతీయ స్థాయిలో గుర్తింపు నోచుకోక గ్రామాలకు పరిమితమైన క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనేలా చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని.. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి క్రీడలు ఎంతో అవసరం

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరికి క్రీడలు ఎంతో అవసరమని.. క్రీడలవల్ల మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో ఆయన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆటలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు ప్లే గ్రౌండ్ సిద్ధం

కమలాపురం : ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణకు స్థానిక సీఎస్ఐ చర్చ్ మైదానంను సిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి తన సొంత నిధులతో సీఎస్ఐ చర్చ్ గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఆడుదాం ఆంధ్రాలో క్రికెట్, వాలీబాల్, ఖో-ఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ ఈవెంట్లలో సచివాలయ, మండల, నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. అయితే నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు మైదానం పెద్దదిగా ఉంటే బాగుంటుందని మండల అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే జడ్పీటీసీని సీఎస్ఐ చర్చ్ గ్రౌండ్‌ను అన్ని ఈవెంట్లు ఆడేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

దీంతో జడ్పీటీసీ తన సొంత నిధులతో గురువారం సీఎస్ఐ చర్చ్ గ్రౌండ్‌ను దోజర్‌తో శుభ్రం చేస్తూ అన్ని ఆటలు ఆడే విధంగా సిద్ధం చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి అవుతాయని ఆయన తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : ఈనెల 30వ తేదీన శనివారం వేంపల్లెలోని వెలుగు కార్యాలయంలో ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని పులివెందుల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఏపీ కార్ల్ భవనంలో సుమారు 500 మందితో ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ కంపెనీ పనులు జరుగుతున్నాయన్నారు. పులివెందులలోని జగనన్న లేఅవుట్‌లో ఆదిత్యా బిర్లా గార్మెంట్ కంపెనీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఆదిత్యా బిర్లా గార్మెంట్స్‌ను ప్రారంభిస్తారన్నారు. నిర్మాణాలు పూర్తైన వెంటనే సుమారు 2 వేల మందితో ఆదిత్యా బిర్లా గార్మెంట్స్‌లో పనులు జరుగుతాయన్నారు. అందుకోసం వేంపల్లెలో నిర్వహించే జాబ్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రోడ్డుకు మరమ్మతులు



జేసీబీతో ముళ్లపొదలను తొలగిస్తున్న దృశ్యం

వల్లూరు : మండలంలోని ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగాలివారిపల్లె నుంచి కేసీ కెనాల్ వరకు పొలాల మీదుగా వెళ్లే దారి, కొత్తగాలివారిపల్లె నుంచి ఇసుకపల్లెకు వెళ్లే దారుల వెంబడి ముళ్ల పొదలు దట్టంగా పెరిగి రోడ్డు గుంతలమయంగా మారింది. గ్రామంలో ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డికి స్థానికులు రోడ్డు సమస్యను తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన తన సొంత నిధులను వెచ్చించి స్థానిక వైఎస్ఆర్‌సీపీ నేతల ఆధ్వర్యంలో గురువారం జేసీబీతో ఆ దారుల వెంబడి వున్న ముళ్ల పొదలను తొలగించారు. గుంతలమయంగా వున్న దారిలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తోలించి గుంతలను చదును చేసి రాక పోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేంద్రనాథ్

లింగాల : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని రామన్నూతలపల్లె, లింగాల గ్రామాల్లో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో జరిగే వికసిత భారత్ సంకల్ప్ యాత్రలో అధికారులందరూ పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరించి వాటిని సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం ప్రధానమంత్రి ఉజ్వల్ భవిష్యత్ కింద మంజూరైన గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

వేంపల్లె : జాతీయ కాంగ్రెస్‌పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. గురువారం వేంపల్లెలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ మహాత్మ గాంధీ, సుభాష్ చంద్రబోస్, నెహ్రూ ఇలా ఎందరో మహానుభావులు కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధృవకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న సెంట్రల్ బోలేవార్డు పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని మెయిన్ రోడ్డులో జరుగుతున్న సెంట్రల్ బోలేవార్డు పనులను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. సెంట్రల్ బోలే వార్డు పనులు జరుగుతున్న ప్రాంతంలో యూజీడీ మ్యాన్ హోల్స్ మూతలు ఊడిపోకుండా సిబ్బంది చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు చదవాలి

వైవీయూ : పుస్తకాలను ఇష్టంగా చదవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు మార్గం ఏర్పరచుకోవచ్చని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'జాతీ ఉర్దూ భాషా అభివృద్ధి మండలి' ఆధ్వర్యంలో గురువారం ఉర్దూ సంచార గ్రంథాలయం వైవీయూకు చేరుకుంది. ఈ సంచార గ్రంథాలయాన్ని వీసీ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి , ఉర్దూశాఖ విభాగాధిపతి డా. రియాజున్నీసా మాట్లాడారు.

అర్థవంతమైన చిత్రాలు గీయాలి



వర్క్‌షాప్‌ను పరిశీలిస్తున్న వీసీ, ప్రిన్సిపాల్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం లలితకళ విభాగాధిపతి డాక్టర్ కె. మృత్యుంజయరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జీవన సంప్రదాయాలు' మ్యూరల్ పెయింటింగ్‌పై ఐదురోజుల వర్క్‌షాప్‌ను వీసీ ఆచార్య చింతా సుధాకర్ సందర్శించారు. రెండోరోజు గురువారం ఆయన ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి విద్యార్థులు గీచిన చిత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ బ్లాక్ అంతర్గత గోడలపై గీస్తున్న చిత్రాలు అర్థవంతంగాను, ఆకర్షణీయంగాను, చూపరులను ఆలోచింపజేసేవిగా ఉండాలని సూచించారు. వర్క్‌షాప్ సంచాలకులు డా. కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ వర్క్‌షాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్‌లు పి. సంతోష్‌కుమార్, కె. రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూ క్యాంటీన్ తనిఖీ

వైవీయూలోని క్యాంటీన్‌ను గురువారం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపులో భాగంగా గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, వీరనాల శివకుమార్, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్దిఖ్‌లు మాట్లాడుతూ ఇప్పటివరకు ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు.

భూమిలేని నిరుపేదలకు పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు డీకేటీ పట్టాలను పంపిణీ చేస్తున్న మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి

వేముల : ఎన్నో ఏళ్లుగా భూములు లేని నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం డీకేటీ పట్టాలను మంజూరు చేసిందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని నల్లచెరువుపల్లె, కొండ్రెడ్డిపల్లె, నారేపల్లె గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు 40.51 ఎకరాలకు సంబంధించిన డీకేటీ పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన భూములను సాగులోకి తెచ్చుకుని పంటలు సాగు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. భూమి లేకుండా కూలీలుగా ఉన్న వారికి గుర్తించి డీకేటీ పట్టాలను మంజూరు చేశారన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన భూములను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, రామకృష్ణారెడ్డి, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



తిమ్మాపురంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీరెడ్డి

ముద్దనూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలసి మండలంలోని తిమ్మాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చారని, అర్హులైన వారు మిగిలివుంటే వారికి కూడా పథకాలు అందుతాయన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం భవనం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి, వైద్యాధికారి కరిష్మా, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజి ఫంగస్, ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి (అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు(వార్ట్స్), కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠ మరియు ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షల తోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్న పిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఇల్లు



నూతన ఇంటిని ప్రారంభిస్తున్న చంద్రశేఖరరెడ్డి

లింగాల : ప్రతి నిరుపేద కుటుంబం ఇళ్లు నిర్మించుకోవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ సెక్రటరీ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక జగనన్న కాలనీలో లబ్ధిదారురాలు శివనారాయణమ్మ నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని జగనన్న ఇళ్లను ప్రారంభించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు పేదలకు ఇచ్చి దేశంలోనే అత్యధిక సంక్షేమ పథకాలు ఇస్తున్న రాష్ట్రంగా నిలిచిందన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలకు తాను ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మీనారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ



దాత కుటుంబ సభ్యులకు గండి వీరాంజనేయ స్వామి చిత్రపటం అందిస్తున్న ముకుందారెడ్డి

చక్రాయపేట : ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ గండి వీరాంజనేయస్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి గురువారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బసిరెడ్డిపల్లెకు చెందిన కలంకుంట్ల ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు లక్ష్మీనారాయణరెడ్డి, రఘునాథరెడ్డిలు రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కడప రాయుడికి పునర్వసు పూజలు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం పునర్వసు పూజలను నిర్వహించారు.

పునర్వసు నక్షత్రం సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. విశ్వక్సేన పూజ, అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చి పుణ్యాహవాచనంతో శుద్ధి చేశారు. అనంతరం పరిమళ ద్రవ్యాలు, పూలతో దేవతామూర్తులకు అలంకారం నిర్వహించారు.

మంచు కురిసే వేళలో..

చలిపులి పంజా విసురుతోంది. దీనికితోడు నాలుగైదు రోజులుగా పొగ మంచు దుప్పటిలా నిండుగా పరచుకుంటోంది. ఉదయం 8.30 దాటినా భానుడి కిరణాలు నేలపై పడ్డం లేదు. ఓ వైపు వాహనదారులు లైట్లు వేసుకుని వెళుతుండగా..మరో వైపు కర్షకులు ఇబ్బందులు పడుతూనే వ్యవసాయ పొలాల్లోకి వెళుతున్నారు. జనజీవనానికి పొగ మంచు ఇబ్బందులు కలిగిస్తున్నప్పటికీ ప్రకృతి ప్రియులకు పొగ మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇదే క్రమంలో ఆరుతడి పంటలపై బుడ్డశనగ, మినుము, జొన్న వంటి పంటలకు మేలు చేకూరుతుందని రైతులు అంటున్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల కోసం పొగ మంచును సైతం లెక్క చేయకుండా యువత తెలవారుజామునే క్రికెట్ ప్రాక్టీసు చేసుకుంటుండడం విశేషం.

–చాపాడు



పంట పొలాల్లో కురుస్తున్న పొగమంచు



చాపాడులో వేకువజామునే క్రికెట్ ప్రాక్టీసు చేస్తున్న యువకులు

ఆలయ నిర్మాణానికి రూ. 5లక్షల విరాళం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామ పంచాయతీలోని కొట్టాల గ్రామంలో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సొంత నిధులు రూ.5లక్షల విరాళాన్ని అందజేశారు. గురువారం సాయంత్రం ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు మాట ఇచ్చాడంటే మరచిపోడని తెలిపారు. ఈ గ్రామంలోని శివాలయం, రామాలయాల నిర్మాణాల్లో తాము భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. జగనన్న ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక వసతులతోపాటు రోడ్లు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. ముందుగా రమాదేవిని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయ కుడు కొట్టాల రంగారెడ్డి సన్మానించారు.